పౌరాణిక కథ

# ఆండాళ్ కళ్యాణం

డా.టి.కళ్యాణీ సచ్చిదానందం

''హరే రామ! హరే రామ! రామ రామ హరే హరే!

హరే కృష్ణ! హరే కృష్ణ! కృష్ణ కృష్ణ హరే హరే!!''


హరి నామస్మరణ చేస్తూ గుడికి వెళ్లడానికి సిద్ధమౌతున్నాడు విష్ణుచిత్తుడు.

''అమ్మా! గోదా! మాలలు కట్టడం పూర్తయిందా?'' అంటూ కేకేసాడు పెరట్లో వున్న కుమార్తెనుద్దేశించి.

''అయిపోయింది నాన్నగారు! వస్తున్నాను'' అంటూ బదులిచ్చి వంగి మరోసారి నూతిలో నీళ్ళలో కదలాడుతున్న తన ప్రతిబిందాన్ని తృప్తిగా చూసుకుంది గోదా సిగలో ముడుచుకున్న మాలను తడుముకుంటూ.

'ఈరోజు ఇంకా చక్కగా కుదిరాయి. కృష్ణా! నీకు నచ్చుతాయిలే' అనుకుంటూ మాలను తీసి బుట్టలో పెట్టింది. గబగబ లోపలకు వచ్చి తండ్రికందించింది.

''వెళ్లివస్తాను తల్లీ! భాగవతంలో రుక్మిణీ కళ్యాణ ఘట్టం ముగిస్తానన్నావు గదూ ఈ వేళ. రాత్రికి పరమాన్నం సిద్ధం చేసివుంచు. నివేదన చేసి నీ నేస్తాలందరికీ పెడతాం'' అని చెప్పి వెళ్లాడు.



ఆయన వెళ్లాక తలుపుపేసుకుని తనవైపే చిలిపిగా చూస్తున్న కృష్ణుని విగ్రహాన్ని సమీపించి పైటలో దాచిన పారిజాత పుష్పాలను దోసిట్లోకి తీసుకుని పాదాల దగ్గర వుంచింది.

'కృష్ణా! ఇంకా ఎంతకాలం నన్నిలా వేధిస్తావు. కలల్లో ఎంతో ఆరడి పెడతావు. ఉలికిపడి పట్టుకోబోతే అందవు. ఈ దొంగాటలింకా ఎన్నాళ్లు? రుక్మిణీదేవి కబురంపగానే స్వయంగా రథం నడుపుకుని వెళ్లి వెంట బెట్టుకుని తెచ్చి మరీ వివాహం చేసుకున్నావు గదా! నా మొరెందుకాలకించవు? ఈ మారుమూల పల్లెలో వున్న అమాయకురాలి హృదయాన్ని దొంగిలించి ఎగతాళిగా నవ్వుకుంటున్నావా? నువ్వు రావాలి, నన్ను నీ దాన్ని చేసుకోవాలి. వస్తావు గదూ' కళ్లల్లో నీళ్లు కమ్ముకువస్తుంటే బేలగా చూసింది. మనస్సులో మాట పెదవి దాటి రానంటున్నది. అయినా తమ మనస్సంతా ఆ వెన్న దొంగే నిండివున్నప్పుడు మాటలతో పనేమిటి? ఆ మనస్సే కాదు ఈ తనువూ ఆయన స్వంతమే గదా! అనుకుంటూ పాదాల మీద తలవాల్చింది గోదా. మూసిన కళ్లముందూ కృష్ణుని మోహన రూపమే కదలాడుతుండటంతో 'కృష్ణా! అందుకో నా చేతిని. నీ సేవలో అంకితమై తరించే భాగ్యాన్ని ప్రసాదించు' అనుకుంది.

విల్లి పుత్తూరు గ్రామంలో వటపత్రసాయి కృష్ణుని మందిరం పూజారి విష్ణుచిత్తుడు. ఆయన ఆ స్వామి పూజకోసం పెంచుతున్న తులసీ వనంలోనే దొరికిన శిశువును భగవత్ప్రసాదంగా భావించి తన బిడ్డగా స్వీకరించాడు. భూదేవి అనుగ్రహించిన ఆ బిడ్డకు గోదా అని పేరు పెట్టి ప్రాణప్రదంగా పెంచి పెద్దజేసాడు. గోరుముద్దలతో కృష్ణుని లీలలను రంగరించి తినిపించాడేమో మరి బాల్యం నుండే గోదాలో కృష్ణునిపై ఆరాధనా, ప్రేమా మొలకలెత్తి యౌవ్వన ప్రాంగణంలో అడుగుపెట్టేసరికి ఆ కృష్ణుడే ఆమె సర్వస్వంగా అయినాడు. 'కృష్ణుడు తన వాడు. తాను పుట్టింది ఆయన కోసమే' అన్న

భావం ఆమె హృదయంలో బలంగా నాటుకుపోయింది.

☆ ☆ ☆

''గోదా! ఏమిటీ సమయంలో నిద్రిస్తున్నావా? లే!''

తండ్రి భుజం పట్టి వూపడంతో ఉలికి పడి కళ్లు తెరిచింది. అంతవరకు శిరస్సు కృష్ణుని పాదాలకాన్చి ఆ నందకిశోరునితో బృందావనంలో విహరిస్తుండిన ఆమె మనస్సు యథాస్థితికి వచ్చింది. లేచి ఆ వేళలో వచ్చిన తండ్రి వైపు ఆశ్చర్యంగా చూస్తూ ''ఏమిటి నాన్నగారు ఈ వేళ పెందరాళే వచ్చేసారే? అదేమిటి పూలమాలలు బుట్టలోనే వుండిపోయాయి. స్వామికి సమర్పించలేదేమిటి?'' అడిగింది ఆందోళనగా.

''ఎట్లా సమర్పిస్తాను. ఆ మాలలు స్వామి కంఠంలో వేయబోతుంటే నిగ నిగ మెరుస్తూ పూలలో చుట్టుకున్న శిరోజాలు కనిపించాయి. పొడవైన ఆ వెంట్రుకలు నీ తల ముడివే అయుండాలి. పొరబాటున వాటిని నీ తలలో ముడుచుకుని తీసి బుట్టలో పెట్టావేమోనని వాటిని తీసివేసాను. ఈ వేళ పుష్పమాల సమర్పించనే లేదు. ఏమిటో మనస్సంతా కలతబారింది. స్వామికి అపవిత్రమైన మాల సమర్పించబోయానని. నా అనుమానం నిజమేనా? ఎందుకు తల్లీ అలా చేసావు'' సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు విష్ణుచిత్తుడు.

''ఇవాళేమిటి? రోజూ ఆ విధంగా నా సిగలో పెట్టుకుని వాటిలో నా ప్రేమను కూర్చి మరీ పంపుతున్నాను ఆ స్వామికి. ఈ తనువు, మనస్సు ఆ స్వామి సేవకే అంకితం కావలసినవి. ఆ విషయం మీకు చెప్పాను గదా నాన్నగారు. నా వెంట్రుకలకు స్వామి వక్షోజాన్ని చేరి పునీతమయ్యే భాగ్యం దక్కకుండా చేస్తారెందుకు? ఈ మాల లేక ఈ వేళ స్వామి కంఠం వెలవెలబోతుండాలి'' మాలను చేతిలోకి తీసుకుంటూ విచారంగా అన్నది గోదా. తానేదో తప్పు చేసానన్న భావమే కలగలేదు ఆమెలో.

విష్ణుచిత్తునిలో మాత్రం కోపం, చిరాకు పొంగుకు వచ్చాయి ఆ మాటలు విని.

''కృష్ణ కృష్ణ! నీ మూర్ఖత్వాన్ని, అమాయకత్వాన్ని ఎలా చక్కదిద్దాలో అర్థం కావటం లేదు. మనం మానవమాత్రులం. భయభక్తులతో ఆ స్వామిని పూజించాలి. అందుకు మనం మొదట అనుభవించి మలిన పడిన పుష్పాలు ఆ స్వామికి సమర్పించడం అపవిత్రమైన కార్యమవుతుంది. ఇకపై అలా చేయకు'' అంటూ కఠినంగా మందలించాడు.

తలవంచుకుని కన్నీళ్లతో మౌనంగా లోపలకు వెళ్లిపోయింది గోదా.

విష్ణుచిత్తుని పితృహృదయం తల్లడిల్లింది ఆమె బాధపడటం చూసి. నిస్సహాయంగా చూసాడు కృష్ణుని వైపు.

''స్వామీ! ఆ పసిదాని తప్పిదం మన్నించు. అతి గారాబంగా పెంచానేమో గట్టిగా మందలించలేకపోతున్నాను. నిన్నే భర్తగా వరించిందట, మరెవరినీ వివాహం చేసుకోదుట. ఇది తీరే కోరికేనా స్వామీ? ఎలా ఆ అమాయకురాలికి నచ్చచెప్పను'' అనుకున్నాడు.

''విష్ణుచిత్తా! ఎందుకయ్యా అంత మథనపడుతున్నావు. గోదా తన నిష్కల్మషమైన ఆరాధనతో నన్నెప్పుడో తన వాడిని చేసుకున్నది. ప్రేమతో ఆమె పంపే పుష్పమాలలు నాకెంతో ప్రియమైనవి. ఈరోజు వాటినందుకునే భాగ్యం లేకుండా చేసావు. అయినా నిన్ను మన్నిస్తున్నాను. ఇప్పటికైనా తండ్రిగా ఆమె కోరిక తీర్చే బాధ్యత నీదని గ్రహించి, అది తీరే మార్గం తెలియజెప్పు నీ గారాల పట్టికి'' అన్న పలుకులు వెలువడ్డాయి కృష్ణ విగ్రహం నుండి.

''ధన్యుడిని స్వామీ ధన్యుడిని. నీ కృపాదృష్టికి నోచుకున్న నా బిడ్డ అదృష్టవంతురాలు. పిచ్చి తల్లి, నా మాటలకెంతగా బాధపడిందో ఏమో!'' అనుకుంటూ లేచి గబగబ లోపలకు వెళ్లాడు.

''గోదా! నా బంగారు తల్లి. ఆ కృష్ణుడు తప్పక నిన్ను చేపడతాడమ్మా! కన్నీళ్ళు తుడుచుకో. నేను చెప్పేది జాగ్రత్తగా విను'' అంటూ బుజ్జగించి దగ్గర కూర్చోబెట్టుకున్నాడు.

''కన్యలు కోరిన వరుడిని పొందడానికి చేయవలసిన శ్రేష్టమైన వ్రతం (తిరు-శ్రేష్టమైన, పావై-వ్రతం) ఒకటున్నది. అదే కాత్యాయనీ వ్రతం! పూర్వం ద్వాపరయుగంలో నారదుడు ఈ వ్రతాన్ని గోపకాంతలకు వుపదేశించాడు. గోపకాంతలతో కృష్ణుడు ఆనందంగా విహరించడం తగదని మందలించి యశోదానందులు కట్టడి చేసి కృష్ణుని దర్శన భాగ్యం గోపికలకు లభించకుండా చేస్తారు. కృష్ణుని చూడలేని తమ జన్మలు వృథా అనుకుంటూ దుఃఖిస్తున్న వాళ్లకు కాత్యాయనీ వ్రతం వుపదేశించి, ఆ వ్రతం ఆచరించి కృష్ణుని సాన్నిధ్యం పొందమని చెబుతాడు నారదుడు. నెల రోజుల పాటు విడవకుండా రోజూ వుదయాన్నే లేచి సూర్యోదయానికి ముందుగా నదీ స్నానమాచరించి, ఒడ్డున మట్టితో కాత్యాయనీ దేవి విగ్రహాన్ని చేసి దాన్ని విధి విధానంగా పూజించడం వల్ల ఆ దేవి కృపతో కోరిన వరుని పొందే భాగ్యం లభిస్తుంది. ఆ విధంగా చేసిన గోపికలకు తిరిగి కృష్ణ దర్శనమే కాక ఆయన సాన్నిధ్యంలో రాసక్రీడలలో పాల్గొని తరించే భాగ్యం లభిస్తుంది. కృష్ణ దర్శనం కోసం పరితపిస్తున్న నీవు కూడా ఆ కాత్యాయనీ వ్రతం ఆచరించు. తప్పక ఆ స్వామి అనుగ్రహం సత్వరంగా సిద్ధిస్తుంది. ఇది పరమ పవిత్రమైన మార్గశి (మార్గశీర్ష) మాసం. మాసాలలో మార్గశీర్ష మాసం తానని స్వయంగా ఆ కృష్ణపరమాత్మే సెలవిచ్చాడు కదా! పైగా రేపు ధనురాశిలోకి సూర్యుడు సంక్రమణం చెందుతున్న పవిత్ర సమయం. రేపే ప్రారంభించి నెలరోజుల పాటు నియమనిష్టలతో వ్రతాన్ని ఆచరించి నీ మనోవాంఛితం నెరవేర్చుకో. సౌభాగ్యవతీ భవ. కళ్యాణమస్తు'' అంటూ దీవించాడు విష్ణుచిత్తుడు తృప్తిగా చూస్తూ.

''అలాగే నాన్నగారు మీరు చెప్పినట్లే చేస్తాను'' అన్నది గోదా ఆనందోత్సాహాలతో మనస్సు పరవళ్లు తొక్కుతుండగా.

☆ ☆ ☆

మరునాటి నుండి వ్రతాచరణకు పూనుకున్న గోదా తననే ఒక గోపకన్యంగా భావించుకుంది. ఆ గ్రామం బృందావనంగా, తన స్నేహితురాళ్లు గోపకన్యలుగా ఆమెకు గోచరించారు.

పవిత్ర మార్గశీర్ష మాసంలో అంతటి కఠినమైన పావనమైన వ్రతం ఆచరించడానికి తగిన శక్తి ఆ కృష్ణుడే తనకిస్తాడని నమ్మి ఆయనను స్తుతిస్తూ ప్రార్థన శ్లోకం పాడుతూ నదివైపు నడక సాగించింది మొదటి రోజు! ఆ వ్రతం చేయడం వల్ల తనకు మాత్రమే కాదు తన సఖులకు ఆ స్వామి దర్శన భాగ్యం లభించాలని వాళ్లనూ రమ్మని ప్రబోధిస్తూ పిలిచింది. ఆ వ్రతం ఆచరించడం వల్ల గ్రామం సుభిక్షమౌతుందని తెలిపింది. సకాలంలో వర్షాలు పడతాయి. పంటలు సమృద్ధిగా పండుతాయి. పాడి పంటలకు కొరత వుండదని తెలియజేస్తూ రోజు కొకటిగా శ్లోకాలు ఆశువుగా ఆమె నోటి నుండి వెలువడసాగాయి.

ప్రాతఃకాల ప్రకృతి సౌందర్యాన్ని వర్ణిస్తూ ఎంతకూ నిద్రలేవని సఖురాలి ఇంటి ముందు నిలిచి ఓపికగా తన గానంతో నిద్ర లేచేలా చేస్తుంది! లేచి వచ్చిన సఖురాలిని కలుపుకుని తిన్నగా నందగోపుని గృహానికే దారితీస్తుంది. గృహద్వారం దగ్గర వున్న కాపలాదారుని ప్రార్థించి లోపలకు వెళ్లి నిద్రిస్తున్న నందయశోదలను, బలరాముని ప్రాతఃశ్లోకాలు చదువుతూ లేవమని ప్రబోధిస్తుంది. ముందుకు వెళ్లి కృష్ణుని పడకగది ముందు నిలబడుతుంది సఖులతో చేరి. ''గుర్రం రూపంలో కేశి రక్కసుడు వచ్చి ఎత్తుకుపోయిన నీళాదేవిని రక్షించి తన దానినిగా చేసుకున్నాడు కృష్ణుడు. ఆ నీళాదేవి ఎంతటి అదృష్టవంతురాలు. చేతిలో పూబంతితో ఆ స్వామి వక్షస్థలం మీద తలవాల్చి హాయిగా నిద్రిస్తున్నది' అనుకుంటూ ఆమెను లేచి స్వామి దర్శనం తమకూ కలగజేయమని ప్రార్థిస్తుంది. నిద్రిస్తున్న కొదమ సింహం జూలు విదుల్చుకుని లేచినట్లు తామర పూలవంటి కళ్లను విశాలంగా తెరిచి తమను చూడమని ఆ కృష్ణుని ప్రార్థి

స్తుంది. తమ ప్రార్థనలు విని లేచి వచ్చిన కృష్ణుని చూసి భక్తిపారవశ్యంతో పులకించి పోతూ తాము చేయబోయే వ్రతానికి కావలసిన వస్తు సామాగ్రి ప్రసాదించమని కోరుతుంది. అందుకు ఫలంగా తప్పక తమకు కృష్ణుని సంపూర్ణానుగ్రహం సిద్ధిస్తుందన్న ఆశను వ్యక్తం చేస్తుంది. అంతేకాదు సాక్షాత్తు ఆ భగవంతుని అవతారమైన ఆ కృష్ణపరమాత్మతో కలిసి ఆడుకోగల అదృష్టం పొందడం వల్ల ఏమీ తెలియని అజ్ఞానులైన తమ గోపికల జీవితాలు ధన్యం చెందాయని ఎంతో అణకువతో విన్నవించుకుంటుంది.

ఇవన్నీ గోదాదేవి వూహలే! కానీ వాటిలో ఎంతటి వుదాత్తమైన భావం దాగివుందని! అందుకే ఆ శ్లోకాలు (పాశురాలు) వింటూ భక్తితో పరవశించిపోయేవాళ్లు ఆమె సఖురాళ్లు. గ్రామవాసులు కూడా.

కాత్యాయనీ వ్రతం రోజూ ముగించి ఇంటికి వచ్చి ఆ కృష్ణునే ధ్యానిస్తూ కాలం గడపసాగింది గోదా.

వైకుంఠ ఏకాదశి పర్వదినం దగ్గర పడుతున్నది. తన వ్రతం సంపూర్ణమై ఆ స్వామి తప్పక తనను పరిగ్రహిస్తాడన్న నమ్మకంతో ఆ స్వామికి బెల్లపు పరమాన్నాలు, పాలు, పెరుగు, వెన్న అన్నీ సమృద్ధిగా నైవేద్యంగా సమర్పిస్తానని మొక్కుకునేది.

ఆమెలోని ఆతృతను అధికం చేస్తూ ధనుర్మాసం ముగియబోతున్నది.

''విష్ణుచిత్తా! రేపు నీ కుమార్తె కోసం పల్లకి వస్తుంది. పెళ్లి కూతురిలా అలంకరించి నా సన్నిధికి తీసుకురా'' అంటూ ఆనతిచ్చాడు స్వామి స్వప్న సదృశ్యంగా సాక్షాత్కరించి.

విష్ణుచిత్తుని ఆనందం వర్ణనాతీతం.

ఆయనలోనే కాదు గ్రామమంతటా కూడా ఆనందం వెల్లివిరుస్తున్నది సంక్రాంతి పండగ సమీపించడంతో. పంటలు పుష్కలంగా పండి గాదెలు నిండాయి. వెల్లవేసిన ఇళ్లు, ఇళ్ల ముందు కళ్లాపిజల్లి అందంగా తీర్చిదిద్దిన ముగ్గులతో ధాన్యలక్ష్మికి స్వాగతం చెప్పడానికి సిద్ధమౌతున్నాయి. పశువులకు చక్కగా రంగులు వేసి కొమ్ములకు వెండి తొడుగులు పెట్టి ముఖాలకు పసుపు కుంకుమలద్ది పూజించుకునే సమయం, సూర్య భగవానుడు ఉత్తరదిశగా సాగుతూ, మకరరాశిలోకి ప్రవేశించే పవిత్ర సమయం సంక్రాంతి పండగ రోజే గనక ధాన్యలక్ష్మికి చెరుకుగడలు, రేగుపళ్లు సమర్పించి పూజించుకోవడం, కొత్త కుండలలో పాలు పొంగించి పొంగలి తయారుచేసి సూర్యునికి నివేదన చేయడం, తమకు సిరిసంపదలు కలగడానికి మూలమైన పశువులను పూజించుకోవడం, ఇంకా ఎన్నో సంబరాలతో ఆ గ్రామంలో జరుపుకునే మూడు రోజుల పండగ ప్రారంభమయ్యేదీ మర్నాడే!

గోదాదేవి పుణ్యమా అని అందరిలో భగవద్భక్తి విశ్వాసం, సద్వర్తనం బలపడ్డాయి.

ఆరోజు సంక్రాంతి సంబరాలలో మొదటి రోజు భోగి పండగ. ఇళ్ల ముందర ముగ్గులతో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలు వుంచి పూజ చేసి ధాన్యలక్ష్మికి స్వాగతం పలకడం ఆనవాయితీ. నాలుగు వీధుల కూడలిలో భోగిమంటలు వేసి చలికాచుకున్న వాళ్లను పలకరిస్తూ ఇల్లు చేరింది గోదా.

'కృష్ణుని దయవల్ల తన వ్రతం సవ్యంగా సమాప్తమైంది. మరి తనను వరించడానికి ఆస్వామి తరలిరావాలి గదా!' అనుకుంటూ గొబ్బెమ్మల పూజ ముగించింది.

ఆమె కోరిక ఈడేరే సమయం వచ్చిందన్నట్లుగా పల్లకీ వచ్చిన అలికిడి అయింది. అందుకోసమే ఎదురుచూస్తున్నట్లుగా నిలిచిన విష్ణుచిత్తుడు సంభ్రమంగా దగ్గరకు వెళ్లి గుడినుండి వచ్చిందని తెలుసుకున్నాడు.

'అమ్మా గోదా! నీ కోసం స్వామి పల్లకి పంపారు తల్లీ! గుడిలో నిన్ను వివాహం చేసుకుంటానని రాత్రి కలలో నాకు సందేశం ఇచ్చాడు. పద. పెళ్లి కూతురివై పల్లకీ ఎక్కు'' అన్నాడు ఆశ్చర్యంగా చూస్తున్న కుమార్తెతో.

ఆనందంతో పరవళ్లు తొక్కుతున్న హృదయంతో పల్లకీ నెక్కింది గోదాదేవి. వెంట విష్ణుచిత్తుడు నడవగా, విషయం తెలిసిన వూరంతా బయలుదేరి వచ్చింది ఆ అద్భుత దృశ్యం చూసి తరించడానికి.

గుడిలో, కృష్ణవిగ్రహం పక్కన పీటపై కూర్చుండబెట్టారు గోదాదేవిని. ఇతరులకు విగ్రహరూపుడే కావచ్చు కానీ ఆమె కళ్లకు మాత్రం ప్రక్కన వరుని అలంకరణలో కృష్ణస్వామే దర్శనమిస్తున్నాడు. పెళ్లి మంత్రాలు చదువుతున్నారు పూజారులు. చేతిలో తాను అల్లిన పూలమాలలతో లేచి నిలబడింది గోదా. వేద మంత్రాల మధ్య మాలను స్వామి మెడలో వేసింది. మూడుసార్లు ప్రదక్షిణ నమస్కారాలు చేసింది. అంతే. అందరూ చూస్తుండగా ఆమె నుండి దివ్యప్రభ వెలువడి స్వామిలో లీనమైంది.

ఆమెకు ప్రతిగా దివ్యప్రభలు వెదజల్లుతున్న విగ్రహం స్వామి ప్రక్కన సాక్షాత్కరించింది.

ఆ అద్భుత దృశ్యం చూసి భక్త్యావేశంతో పులకించిపోయారందరూ.

''ఆండవన్ (స్వామిని) ని చేరిన గోదా ఆండాళ్ (అమ్మవారు)గా వెలిసింది మనందరి పూజలందుకుని ధన్యులను చేయడానికి. వారి కళ్యాణం పూర్తిగా చూసి చరితార్థులమవుదాం. అందరూ కూర్చోండి'' అని చెబుతూ కళ్యాణ మహోత్సవం పూర్తికావించారు పూజారులు.

విష్ణుచిత్తునిలో పూర్వస్మృతి కలిగింది. గరుత్మంతుని అంశయైన తాను లక్ష్మీదేవిని పుత్రికగా పొందగోరడం, ఆమె వివాహం చూడాలని వాంఛించడం గుర్తుకు వచ్చాయి. అయోనిజగా లక్ష్మీదేవి తన కోసం తులసీవనంలో ప్రభవించినట్లు గ్రహించి భక్తితో పరవశించిపోయాడు.

''నాన్నగారు! మీ కోరిక తీరింది గదూ! ఇక పై మీ గోదా ఆండాళ్‌గా ప్రసిద్ధి చెందుతుంది. కన్యలకు కోరిన వరులను, సత్సంతానాన్ని ప్రసాదించే సంతానలక్ష్మిగా పూజింపబడుతుంది. మీ హృదయంలో గారాలపట్టిగానే నిలిచిపోతుంది. మీ జీవితాన్నికపై స్వామి సేవకు అంకితం చేసి తరించండి''

తన చెవి దగ్గర గోదా పలికిన పలుకులు విని ''నీ ఆజ్ఞ శిరసావహిస్తాను తల్లీ!'' అంటూ కన్నులర మోడ్చి ధ్యానమగ్నుడైనాడు.

☆ ☆ ☆

ఆ విధంగా భోగి పండగ ఆండాళ్ కళ్యాణంతో ఎంతో పవిత్రతను సంతరించుకుంది. శ్రీవైష్ణవులకు ఆమె ఆరాధ్యదైవం, కోరిన వరాలు ప్రసాదించే శ్రీమహాలక్ష్మి అవతారం.

ఆమె ఆశువుగా చెప్పిన పాశురాలు ధనుర్మాసంలో విధిగా రోజూ పఠించడం ఆనవాయితీగా మారింది. విల్లిపుతూరు ద్రవిడ దేశంలో వుండటం వలన (దక్షిణాదిన తమిళనాడు ప్రాంతం) ద్రవిడ భాషా గ్రంథాలల్లో, పురాణాలలో ఆండాళ్ చరిత్రం ఎంతో విశదంగా తెలుపబడింది. ఆమె చెప్పిన పాశురాలే 'తిరుప్పావై' అనే పేరుతో ప్రసిద్ధిపొందాయి. విష్ణుచిత్తుడు పెరియాళ్వార్' గా పిలువబడుతూ వైష్ణవభక్తి ప్రచారానికి తన శేష జీవితాన్ని అంకితం చేసి ధన్యుడైనాడు.

గోవిందరాజ స్వామిగా ఆండాళ్‌ను చేపట్టిన కారణంగా గోవిందరాజ స్వామి మందిరాలలో, వేంకటేశ్వరస్వామి మందిరాలలో, ఇతర విష్ణ్వాలయాలలో ఆండాళ్ విగ్రహం, ఆళ్వార్ల విగ్రహాలు ప్రతిష్ఠించడం సాంప్రదాయమైంది.

నిర్మలమైన ప్రేమకు ప్రతీక గోదాదేవి. ధనుర్మాసంలో ప్రతిరోజూ ఆమె పావన చరితాన్ని గుర్తుకు తెస్తుంటుంది. అందుకే ఆ మాసంలో తిరుపతిలోనూ వేంకటేశ్వర సుప్రభాతానికి బదులుగా 'తిరుప్పావై' పఠిస్తుంటారు.

స్వామికి ఆండాళ్ గుర్తుగా అలంకరణలో చిలుకను ధరింప జేస్తుంటారు. ఈనాటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో విల్లిపుత్తూరులోని. గోదాదేవి మందిరం నుండి పూలమాలలను ఆమెకు ప్రతిగా స్వామివారికి అలంకరించడం జరుగుతున్నది. ప్రేమ, భక్తితత్వాల సమగ్రరూపం ఆండాళ్! భోగి పండుగ నాడు ఆమె కమనీయమైన కళ్యాణవైభవాన్ని కన్నులారా చూసి ధన్యులౌతారు భక్తజనావళి!

☆